సాక్షి రంగారెడ్డి

సోమవారం ꠰ 18 ꠰ ఆగస్టు ꠰ 2025



అడుగుకో గుంత..

రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. అడుగడుగునా గుంతలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. 8లో▸



వీధుల్లో అంధకారం

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద గోల్కొండలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



మూగజీవాలు భద్రం

వానాకాలం మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. పశువులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. 8లో▸

న్యూస్‌రీల్

లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



ఆమనగల్లు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో అక్టోబర్‌లో నిర్వహించే లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన, మహాత్మాగాంధీ సుస్థిర మహా విజ్ఞాన సదస్సు పోస్టర్‌ను ఆదివారం పట్టణంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో గాంధీ భావజాలం ఉన్నట్లయితే ఆ ఇల్లు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ సాహితీ అధ్యక్షుడు గోపాల్‌జీ, లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆచార్య సోమశేఖర్, ఆచార్య గణపతి, ఆచార్య కేతన్ మహాజన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బోనగిరిపల్లి వద్ద ఉన్న మహర్షివేద గురుకులంలో ఆదివారం ఉపనయన సంస్కారం కార్యక్రమం నిర్వహించారు. యజ్ఞ హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం దేవుడికి కేటాయించాలని సూచించారు. దేవాలయాలవద్దకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీతా సారాన్ని ఆచరిస్తే మోక్షం



శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: శ్రీకృష్ణ భగవానుడు బోధించిన భగవద్గీత సారాంశాన్ని ఆచరిస్తే మోక్షం లభిస్తుందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి– ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో రెండు రోజులుగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీకృష్ణుడి ప్రతిమతో పరమేశ్వర థియేటర్ రోడ్డు, గంజి, మెయిన్ రోడ్డు, కాలేజ్‌రోడ్డులోని పురవీధులుగా మీదుగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో భాగంగా కోలాట నృత్యాలు, భగవద్గీత శ్లోక ఉచ్చరణలతో, భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గుణ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలను వదిలిపెట్టి సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అరుంధతి, కుల్దీప్‌రెడ్డి, ధన్వంతరి, సుధీర్, దినేష్, శిరీష, వాసంతి, సాత్విక, నవ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

అనంతగిరి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఈ నెల 19న వికారాబాద్‌కు రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రమేష్‌కుమార్, శివరాజు, వర్దనందు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఇక్కడికి రానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్నెగూడ రోడ్‌లో, వికారాబాద్‌లో శివారెడ్డిపేట వద్ద కమలనాథులు ఘన స్వాగతం పలికి, ర్యాలీగా వస్తారని చెప్పారు. అనంతరం ఎన్నెపల్లి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. అక్కడి నుంచి అనంతపద్మనాభ స్వామి దర్శనానికి వెళ్తారన్నారు. పార్టీ నాయకులు కేపీ రాజు, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనెక్షన్లు.. కలెక్షన్లపై నజర్

డిస్కంలో ఇంటిదొంగలు!



- బిల్డర్లతో కుమ్మక్కు.. తక్కువ లోడుతో కనెక్షన్లు జారీ
- కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్న ఆర్టిజన్లు
- బస్తీ పర్యటనల్లో పలు లోపాల గుర్తింపు
- సంస్థ నష్టాలకు కారణమవుతున్న ఇంజనీర్లపై వేటుకు రంగం సిద్ధం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని పలువురు ఇంజనీర్లు బిల్డర్లతో దోస్తీ చేస్తూ అనధికారిక భవనాలకు తక్కువ లోడుతో కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు. ఆ తర్వాత లో ఓల్టేజీని సాకుగా చూపించి సంస్థ నిధులతో డెవలప్‌మెంట్ పనులు చేయిస్తున్నారు. ప్రత్యక్షంగా వినియోగదారుల జేబును గుల్ల చేస్తుండడంతో పాటు సంస్థ అంతర్గత నష్టాలకు కారణమవుతున్నారు. వినియోగదారుని పేరున నమోదు కావాల్సిన ఎల్‌టీఎం అగ్రిమెంట్లు ఒకే వ్యక్తి నంబర్‌పై 843 వెలుగు చూశాయి. కాంట్రాక్టర్ల పేరునే కాదు ఏకంగా ఓ లైన్‌మెన్ నంబర్‌పై 140 ఎల్‌టీఎం అగ్రిమెంట్లు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పరిశీలనలో తేలాయి. సంస్థ నుంచి నెలవారీ వేతనాలు తీసుకుంటూ పరోక్షంగా నష్టాలకు కారణమవుతున్న ఇంజనీర్లు, ఆర్టిజన్ కార్మికులపై సీఎండీ సీరియస్ అయినట్లు తెలిసింది. ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్లతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లోనూ ఇదే అంశంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.

కాంట్రాక్టర్లుగా ఆర్టిజన్లు

గ్రేటర్‌లో పది సర్కిళ్లు ఉండగా, మూడు (మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్) జోన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 30 ఆపరేషన్ డివిజన్లు ఉండగా, 220 వరకు ఆపరేషన్ సెక్షన్లు పని చేస్తున్నాయి. 213 మంది ఆపరేషన్ ఏఈలు 12 వేల మందికిపైగా జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లు పని చేస్తున్నారు. ఇతర విభాగాల్లోని ఉద్యోగులతో పోలిస్తే వీరి వేతనాలు కూడా ఎక్కువే. క్షేత్రస్థాయిలోని కొంత మంది ఏఈలు, జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లు గుట్టుగా కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. బిల్డర్లతో కుమ్మక్కై డిస్కం ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి కొడుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోని నిర్మాణాలకు కొత్త కనెక్షన్లు జారీ చేసే విషయంలో భారీ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు లేని భవనాలకు, అసైన్డ్/ప్రభుత్వ/ భూదాన్ భూముల్లో వెలుస్తున్న భారీ నిర్మాణాలకు గుట్టుగా కనెక్షన్లు జారీ చేస్తున్నారు. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సమయంలో వినియోగదారుని ఫోన్ నంబర్ కాకుండా ఇతర నంబర్లు నమోదు చేయిస్తున్నారు. నెలవారీ బిల్లుల సమాచారం మాత్రమే కాదు సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య, లైన్ల పునరుద్ధరణ కోసం తీసుకుంటున్న ఎల్సీల వంటి సమాచారం వారికి చేరడం లేదు. అంతేకాదు మూడు నుంచి ఐదు కిలోవాట్ల డిమాండ్ ఉన్న వారికి కేవలం కిలో వాట్ కనెక్షన్ జారీ చేస్తున్నారు. తర్వాత లో ఓల్టేజీ సమస్య తలెత్తుతుండగా ఓల్టేజీ పెంపు పేరుతో సంస్థ నిధులను కొల్లగొడుతున్నారు.

బస్తీ పర్యటనలతో గుట్టు రట్టు

విద్యుత్ లైన్లు, తరచూ సాంకేతిక లోపాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించేందుకు ఇటీవల ఇంజనీర్లు బస్తీబాట పట్టారు. డైరెక్టర్లు సహా సీఎండీ వరకు ఇలా ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ క్రమంలో అక్రమాలను గుర్తించినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఏఈలతో సీఎండీ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లోనూ ఇదే అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. కొంత మంది ఏఈలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. డిస్కం నుంచి నెలవారీ వేతనాలు తీసుకుంటూ గుట్టుగా కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన క్షేత్రస్థాయి ఏఈలు, జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లపై కూడా దృష్టిసారించినట్లు తెలిసింది. ప్రజావసరాల కోసం డిస్కం స్టోర్ల నుంచి డ్రా చేసిన మెటీరియల్‌ను ప్రైవేటు అపార్ట్‌మెంట్లు/ సంస్థలకు తరలించిన వారిని సైతం గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

❖ బోనం.. ఘనం

జిల్లాలోని పలు చోట్ల ఆదివారం బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువత తీన్మార్ స్టెప్పుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



యాచారం: కళాకారుల నృత్యాలు



కడ్తాల్: బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సర్దార్ పాపన్నగౌడ్ సేవలు మరువలేనివి

కడ్తాల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ముద్విన్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సర్దార్ పాపన్నగౌడ్ చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ వీరత్వానికి ప్రతీక అంటూ కొనియాడారు. ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు స్థలంతో పాటు రూ.3 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు రామారావుగౌడ్, బీసీ పొలిటికల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజుగౌడ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి, పీసీబీ మెంబర్ బాలాజీసింగ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య

ఇబ్రహీంపట్నం: హమాలీ కార్మికులకు హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వీరయ్య డిమాండ్ చేశారు. రైస్ మిల్లు హమాలీ కార్మికుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఒకటవ మహాసభను స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. రైస్ మిల్లు యాజమాన్యాలు కార్మికులకు సంవత్సరానికి రూ.7 వేల బోనస్, ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రెండేళ్లకు ఒకసారి అగ్రిమెంట్ రూపంలో కూలీ రేట్లు పెంచాలని కోరారు. అనంతరం హమాలీ కార్మికుల మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా దుర్గయ్య, కోశాధికారిగా జంగయ్య, ఉపాధ్యక్షులుగా జంగయ్య, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, రామ్‌రెడ్డి, జంగయ్య, ఆర్గనైజర్‌గా బుగ్గరాములు, పండిత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యోలమోని స్వప్న, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్ పాల్గొన్నారు.

బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయండి

పరిగి: స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందశాతం రిక్రూట్‌మెంట్ చేయాల్సిన పోస్టులను.. 2024 డీఎస్సీలో 30శాతం చేసి, మిగతా 70శాతం పదోన్నతులు కల్పించడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2016లో తెచ్చిన వికలాంగుల హక్కుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, వందశాతం రిక్రూట్‌మెంట్ ద్వారానే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

దండిగా.. నిండుగా..

- నీళ్లతో ప్రధాన జలాశయాలు కళకళ
- రానున్న వేసవి వరకు నగర తాగునీటికి బేఫికర్
- మరోవైపు గోదావరి 3, 4 ఫేజ్‌లు, మంజీరా రెండో దశ
- అదనపు జలాల తరలింపునకు జలమండలి ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు అందించే ప్రధాన జలాశయాలు నాగార్జున సాగర్, గోదావరితో పాటు మంజీరా, సింగూర్, ఉస్మాన్‌సాగర్, హిమయాత్ సాగర్ జలాశయాల్లో దండిగా నీరు చేరింది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటున్నాయి. దీంతో వచ్చే ఏడాది వేసవి వరకు తాగునీటి తరలింపునకు ఎలాంటి కొరత లేకుండాపోయింది.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..

మహా నగరానికి నాగార్జున సాగర్, గోదావరి నుంచే సుమారు 75 శాతానిపైగా తాగునీటి సరఫరా ఉంటుంది. కృష్ణా తాగునీటి సరఫరా పథకం 1, 2, 3 దశల కింద నాగార్జున సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రోజువారీగా 270 ఎంజీడీల నీటిని తరలిస్తుండగా, గోదావరి నీటి సరఫరా పథకం కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 168 ఎంజీడీలు సరఫరా జరుగుతోంది. సింగూర్ నుంచి 75 ఎంజీడీలు, మంజీరా నుంచి 45 ఎంజీడీలు, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి 40 ఎంజీడీల నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. మరోవైపు గోదావరి మూడు, నాలుగో దశ, మంజీరా అదనపు పైపులైన్ ఏర్పాట్లకు జలమండలి సన్నహాలు చేస్తోంది. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా నీటిని సరఫరా చేసేందుకు అదనపు జలాల తరలింపునకు ఏర్పాట్లు చేస్తోంది.

పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో..

నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువవుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద పోటెత్తి నాగార్జున సాగర్ జలాశయం నిండకుండలా మారింది. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తి నీటి మట్టానికి రెండున్నర అడుగులు దూరంలో ఉంది. ఎగువ ప్రాంతం కడెం ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టు నీటిని నగరంలోని కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే.. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు గోదావరి జలాలు సరఫరా జరుగుతోంది.



జంట జలాశయాలకు వరద ప్రవాహం

జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం అధికమైంది. హిమాయత్ జలాశయం పూర్తి నీటిమట్టం చెరువవుతుండటంతో గేట్లు ఎత్తి దిగువన నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి కూడా వరద ప్రవాహం పెరిగింది. జంట జలాశయాల పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకరపల్లి, మొమిన్‌పల్లి, దోబీపేట్ చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్ పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసి వరద నీటి ప్రవాహం మూసీ, ఈసీల ద్వారా జలాశయాలలోకి చేరుతోంది. మరోవైపు మంజీరా, సింగూర్ ప్రాజెక్టులకు కూడా వరద ప్రవాహం జోరుగా సాగుతోంది. భారీగా వరద వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి దిగువ వదులుతున్నారు. మొత్తానికి వచ్చే వేసవి నాటికి నగర దాహార్తి తీరేందుకు ఎటువంటి ఢోకా ఉండదు.

ఆగని ఆక్రమణలు!

- ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు యథేచ్ఛగా కబ్జా
- రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతం
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు

తుర్కయంజాల్: ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు పరాధీనం అవుతున్నాయి. అక్రమార్కు లు రెచ్చిపోయి కబ్జాలకు ప్రయత్నిస్తున్నా అధికారుల చర్యలు తూతూ మంత్రంగా ఉంటున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం.. పనులను అడ్డుకోవడం వంటి పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంలో, భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయడంలో, వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దు రాళ్లు నాటుతుండగా..

తుర్కయంజాల్ రెవెన్యూ కమ్మగూడలోని సర్వే నెంబర్లు 227,228లో మను లే అవుట్‌లోని 871 గజాల భూమికి బై నంబర్లు వేసి డాక్యుమెంట్లు చేసిన వ్యక్తులు పలుమార్లు కబ్జాకు ప్రయత్నించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.5 కోట్ల విలువైన ఈ భూమి సాగర్ రహదారికి కూతవేటు దూరంలో ఉండడంతో కమర్షియల్ భవన నిర్మాణాలకు అనుకూలంగా ఉంటుంది. దీంతో అధికారులు ఎన్నిసార్లు ఆపడానికి ప్రయత్నించినా కబ్జాదారులు తమ ప్రయత్నాలు విరమించడం లేదు. తాజాగా వరుసగా సెలవులు రావడంతో ఇదే అదనుగా రెండు రోజుల క్రితం ప్లాట్లకు హద్దు రాళ్లను నాటుతుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. భవన నిర్మాణ అనుమతి కోసం గతంలో హెచ్‌ఎండీఏకు, మున్సిపాలిటీకి పలుమార్లు దరఖాస్తు చేసిన విచారణ సమయంలో తిరస్కరిస్తూ వచ్చారు. ఇటీవల అధికారులు 400 గజాల ప్లాటుకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హెచ్చరిక బోర్డుల తొలగింపు

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి రాగన్నగూడలోని సర్వే నంబర్లు 549, 551, 552లో 1984లో 55 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో శ్రీమిత్ర డెవలపర్స్ వారు వెంచర్‌ను చేసి ప్లాట్లు విక్రయించారు. ఆ సమయంలో ప్రజాప్రయోజనార్థం సుమారు మూడు ఎకరాల ఖాళీ స్థలాన్ని వదిలారు. ఇది హెచ్‌ఎండీఏ, డీటీసీపీ నుంచి అనుమతి వెంచర్ కాకపోవడంతో ఇదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు మరో లే అవుట్‌ను సృష్టించి అమాయకులకు విక్రయించారు. దీనిపై వరుసగా మీడియాలో కథనాలు రావడం, పలువురు స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు నామమాత్రంగా బోర్డులు ఏర్పాటు చేయడం, తరువాత అక్రమార్కులు వాటిని తొలగించడం పరిపాటిగా మారింది. తాజాగా శ్రీశైలం అనే వ్యక్తి 600 గజాల భూమిలో ప్రహరీ నిర్మిస్తుండటంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మూడు ఎకరాల భూమికి సమీపంలో టీసీఎస్, ఔటర్ రింగ్ రోడ్డు వంటివి ఉండటంతో దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్ల పై మాటే.

4,211 గజాల భూమి ప్లాట్లుగా..

సర్వే నంబర్లు 501, 505,530, 533, 657, 658, 659, 660, 661, 662లోని శ్రీమిత్ర వెంచర్‌లో 9వేల 438 చదరపు గజాల స్థలాన్ని ప్రజా ప్రయోజనార్థం మొదటి లే అవుట్‌లో వదిలారు. ఖరీదైన భూమి కావడంతో అక్రమార్కులు 2013లో మరో లే అవుట్‌ను సృష్టించి కేవలం 2వేల గజాల వరకు ప్రజా ప్రయోజనార్థం వదిలారు. సుమారు 7,700 గజాల భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.15 కోట్ల పైమాటే. ఫిర్యాదులు అందిన ప్రతిసారి అధికారులు బోర్డులు ఏర్పాటుచేయడం అనంతరం తొలగించడం యథావిధిగా మారాయి. ఇవే కాకుండా మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్, మన్నెగూడ, మునగనూర్, తొర్రూర్, కొహెడలోని అనేక పార్కులు, ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఓ లే అవుట్‌లో పనులు అడ్డుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

❝ చర్యలు తీసుకుంటాం



ప్రజా ప్రయోజనార్థం, పార్కుల కోసం వదిలిన భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కమ్మగూడలోని మను ఎన్‌క్లేవ్‌లోని భూమికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకుంటాం. శ్రీమిత్ర వెంచర్‌లోని స్థలాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– కె.అమరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

మద్యానికి బానిసై.. ఉరివేసుకుని

డ్రైవర్ బలవన్మరణం


వెంకటేశ్ (ఫైల్)

మొయినాబాద్: మద్యానికి బానిసైన ఓ డ్రైవర్ కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన కావలి వెంకటేశ్ (48) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. దీంతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లింది. శనివారం మధ్యాహ్నం వెంకటేశ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్ చేసి తాను ఉరివేసుకుని చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిశీలించారు. మద్యం మత్తులో ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా ఇంటి దగ్గరే వదిలి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులోనే ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధుల్లో అంధకారం

శంషాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గోల్కొండలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఎదురుగా వచ్చే వారిని గుర్తు పట్టలేనంతగా వీధులో చీకట్లు అలుముకుంటున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాల మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


చీకట్లో పెద్దగోల్కొండలోని ఓ వీధి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ క్రిమినల్స్ టోకరా

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ మోసగాళ్లు షాకిచ్చారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని ఐలాం కాలనీలో నివసించే సీతారత్నం (40) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సెల్‌ఫోన్‌ను నెల క్రితం పోగొట్టుకున్నాడు. అదేరోజు బ్యాంక్ అకౌంట్‌తో పాటు సిమ్‌కార్డును హోల్డ్‌లో పెట్టారు. రెండు రోజుల క్రితం ఆమె పోగొట్టుకున్న ఫోన్ నెంబర్‌ను తిరిగి తీసుకున్నారు. ఫోన్ పే చేయాలని చూడగా ఫెయిల్యూర్ అని వచ్చింది. దీంతో ఆమె యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లి విషయం చెప్పగా నెల క్రితం అకౌంట్‌ను హోల్డ్ చేసినప్పుడు డెబిట్‌కార్డును కూడా హోల్డ్ చేశామని.. మళ్లీ తీసుకోవాలని చెప్పారు. దీంతో ఆమె డెబిట్‌కార్డు మరోసారి తీసుకుంది. యాక్టివేషన్ జరిగిన కొద్ది సేపట్లోనే ఆమె ఫోన్‌కు రూ.50 వేల చొప్పున రెండుసార్లు అకౌంట్ నుంచి డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. పోగొట్టుకున్న తన ఫోన్‌లో నుంచి సిమ్‌కార్డును తీసుకుని సైబర్ మోసగాళ్లు డబ్బులు డ్రా చేసి ఉంటారని భావిస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన

అల్వాల్: ఏడేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం బాలాజీ రైస్ మిల్ సమీపంలో నివసించే ఖాసీం (27) శనివారం సాయంత్రం తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికకు తన ఇంట్లోని ఆక్వేరియం చూపిస్తానని తీసుకెళ్లి బంధించి అసభ్యంగా ప్రవర్తించాడు. కుమార్తె కనిపించకపోవడంతో బాధిత తల్లిదండ్రులు ఖాసీం ఇంట్లో ఉందని తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నింధితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SHADNAGAR :
O.S NO 60 OF 2020
Between:-
Panuganti Anantha Laxmi ....Plaintiffs
And
Mohammed Mathloob Ahmed and others ......Defendants
To,
D-3. MOHAMMED KHALEEL W/o Late Mohd Khadar, Aged about 70 years, Occ: Business, R/o H.No. 3-21, Padmavathi Colony, Shadnagar Town, Ranga Reddy District.
D-5. MOHAMMED FAKHER AHMED S/o Mohd Jilani, Aged about 33 years, Occ: Business, R/o H.No. 15-117, Gandhinagar Colony, Shadnagar Town, Ranga Reddy District.
D-7. FAIZ KHAN S/o Abdul Rasheed Khan, Aged about 39 years, Occ: Business, R/o H.No. 22-159/2, Mohamood Nagar Colony, Farooqnagar, Shadnagar Town, Ranga Reddy District.
Defendant No. 3, 5 and 7
NOTICE
Whereas the plaintiff has instituted above suit for Declaration of Title. You all are hereby summoned to appear before this court in person or through pleader to answer such all questions on the 8th day of September 2025 at 10.30 A.M.
If you failed to appear before the court on 08-09-2025 at 10.30 A.M either in person or through advocate the matter will be decided in your absence.
//By order of the Court//
M. MOHAN RAO
Advocate - Shadnagar.

ఊరికి వెళ్తున్నానని చెప్పి.. కనిపించకుండా పోయి


సాబెర్ హుస్సేన్ (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సాబెర్ హుస్సేన్ (20) రెండు నెలల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి హర్షగూడలో ఉన్న కంపెనీలో లేబర్‌గా పని చేస్తున్నాడు. తనకు ఇక్కడ పని చేయడం ఇష్టలేదని తోటి స్నేహితుడు లస్కర్‌కు చెప్పి సొంతూరు వెళ్తానంటూ ఈ నెల 6న బయల్దేరాడు. సొంతూరుకు వెళ్లకపోవడంతో పాటు ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. ఈ విషయమై స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారంటూ ఫిర్యాదు

తమపై కూడా దాడి జరిగిందని ఎక్సైజ్ పోలీసులు సైతం..

జీడిమెట్ల: నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సోదరుడిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడిచేయించారని కుత్బుల్లాపూర్‌కు చెందిన పవన్ కుమార్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ సైతం తన విధులకు కొందరు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఇరువురి ఫిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- శనివారం రాత్రి ఓ యువకుడి గంజాయి, హష్ అయిల్ సేవిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. రెండవ వ్యక్తిని పట్టుకునేందుకు కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్‌కు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ దర్యాప్తు చేస్తుండగా స్థానికంగా ఉన్న హేమంత్, నితీష్, రవితేజ, చరణ్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆమె జీడిమెట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు.
- శనివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు బాలు మహేందర్,హేమంత్ అనే ఇద్దరిని విచారణ చేస్తున్నారు. వెంకటేశ్వర నగర్‌కు చెందిన చంటియాదవ్ చూసి వారిని పట్టుకోవడానికి మీరెవరు అంటూ ప్రశ్నించాడు. దీంతో వారు దాడిచేశారని.. డాక్టర్లు 23కుట్లు వేశారని బాధితుడి సోదరుడు పవన్‌కుమార్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరు వర్గాల ఫిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు


సురంగల్ రోడ్డులో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షం నీరు

అడుగుకో గుంత.. వెళ్లాలంటే చింత

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- వాహనదారులకు తప్పని పాట్లు


అజీజ్‌నగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మొయినాబాద్: రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. అడుగడుగునా గుంతలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్లతోపాటు గ్రామాల లింకు రోడ్లు సైతం అధ్వానంగా మారాయి. వర్షాల కారణంగా హిమాయత్‌నగర్- తంగడపల్లి ఆర్ అండ్ బీ రోడ్డులో చిలుకూరు వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు నడుములు పట్టేస్తున్నాయని వాపోతున్నారు. చిలుకూరు-మొయినాబాద్ లింకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో గుంతల్లో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. మొయినాబాద్- అమీర్‌గూడ రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై వెళ్లడానికే వాహనదారులు, స్థానికులు జంకుతున్నారు. సురంగల్-శ్రీరాంనగర్ రోడ్డుపై వర్షం నీరు నిలిచి గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు ఇళ్ల మధ్యలోనుంచే ఉండటంతో వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


రాజేందర్


రత్నం

శంషాబాద్ రూరల్: వేర్వేరు ఘటనలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... మహారాష్ట్రకు చెందిన సూర్యవంశీ రాజేంద్ర(35), పూజ దంపతులు ఉపాధి కోసం పదేళ్ల కిందట వలస వచ్చి ఇందిరానగర్ దొడ్డిలో నివాసముంటున్నారు. ఈ నెల 10న పూజ ఉదయం పనికి వేళ్ల సమయంలో రాజేంద్ర ఇంట్లోనే ఉన్నాడు. స్వగ్రామం వెళ్తానని చెప్పాడు. అదే రోజు సాయంత్రం పూజ పని నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. ఇంటికి తాళం వేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. భర్తకు చెందిన దుస్తులు, బ్యాగు కనిపించలేదు. అతను స్వగ్రామం వెళ్లి ఉంటాడని భావించింది. దీంతో భర్తకు ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ అయింది. అత్తకు ఫోన్ చేసి అడగగా అక్కడకు రాలేదని చెప్పింది. దీంతో అతని కోసం అన్ని చోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

ముచ్చింతల్‌కు చెందిన బొడ్డు రత్నం(48) ఈ నెల 13న నందిగామ మండలం చేగూరులో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. అదే రోజు రాత్రి రత్నం భార్య మంజుల తన కూతురుకు ఫోన్ చేసి వాకబు చేసింది. అతను కూతురు వద్దకు వెళ్లలేదని తెలియడంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వైద్యుడి అరెస్టు

ఫిలింనగర్: పెళ్లి జరిగిన విషయాన్ని దాచిపెట్టి యువతితో సహ జీవనం చేయడమే కాకుండా ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని అడగడానికి వెళ్లిన యువతిపై దాడి చేసిన వైద్యుడిని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లోని ఏషియన్ స్పైన్ హాస్పటల్‌లో బాచుపల్లికి చెందిన డాక్టర్ పోసినపల్లి రాజేందర్‌రెడ్డి (35) ఆర్థోపెడిక్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. 2024 సెప్టెంబర్‌లో మణికొండ పంచవటి కాలనీకి చెందిన డిజైనర్ (28)తో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఇద్దరూ కలిసి మణికొండలోని డిజైనర్ ఇంట్లోనే సహజీవనం చేస్తున్నారు. కాగా డాక్టర్ రాజేందర్‌రెడ్డికి అంతకు రెండేళ్ల క్రితమే వివాహం కాగా, ఆ విషయాన్ని దాచిపెట్టి డిజైనర్‌తో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని సదరు యువతి పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి రాజేందర్‌రెడ్డిని నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్యా తీవ్ర గొడవ జరగ్గా ఆమెను కొట్టడమే కాకుండా ఫోన్‌ను నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. ఎటూ వెళ్లకుండా కొద్దిసేపు ఆమెను అడ్డగించి వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు డాక్టర్ రాజేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విస్తారంగా వర్షాలు

నీటమునిగిన పంటలు

పూడూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటమునిగాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల పరిధి రేగడిమామిడిపల్లి, బార్లపల్లి, చన్గోముల్, తిమ్మాపూర్, కంకల్, మిట్టకంకల్, చింతలపల్లి, పూడూరు, పుడుగుర్తి తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చన్గోముల్- బార్లపల్లి మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై బురద వచ్చి చేరింది. పుడుగుర్తి, కడుమూరు, కంకల్, మంచన్‌పల్లి, మేడిపల్లి కలాన్, ఈసి వాగు పరుగులు తీస్తోంది. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఠాణా వద్ద పట్టుబడిన ట్రాక్టర్లు

బొంరాస్‌పేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ల యజమానులు అంజిలయ్య, శ్రీకాంత్‌లపై కేసునమోదు చేశా మని ఎస్‌ఐ బాల వెంకటరమణ తెలిపారు.

ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తే చర్యలు


పోలీసుల అదుపులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

రాజేంద్రనగర్: వాహనదారులు ప్రమాదకర విన్యాసాలు, ప్రజలకు ఆటంకం కలిగించేలా ర్యాష్‌గా డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రాజు హెచ్చరించారు. ఇటీవల మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన బాబానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రషీద్, చంపాపేట్‌కు చెందిన జాఫర్ అహ్మద్ షా, బాలాపూర్‌కు చెందిన సయ్యద్ అఫ్రోజ్ అనే యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి హోండా షైన్ వాహనం (ఏపీ12పీ 7745), యాక్టివా (టీఎస్10ఎఫ్‌జీ 5061) వాహనాలను స్వాధీనం చేసుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామన్నారు. ఈ 16వ తేదీన బండ్లగూడ నుంచి ఆరాంఘర్ వైపు ముగ్గురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలను నడుపుతూ వాహనాలపై మద్యం సేవిస్తూ ప్రజలకు, వాహనదారులు ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ విషయాన్ని ఇతర వాహనదారులు వీడియోలు తీసి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు ఆన్‌లైన్‌లో తెలపగా.. వారిని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి వారి పత్రాలను పరిశీలించి తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామని వివరించారు.

పెద్దమ్మ ఆలయంలో భక్తురాలి గొలుసు చోరీ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించేందుకు వచ్చిన ఓ మహిళా భక్తురాలి బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఎల్బీనగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చారు. అదే సమయంలో మొక్కు తీర్చుకుంటుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ చోరీకి గురైంది. అందులో ఉన్న 13 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురి కావడంతోఆమె కొడుకు నరేంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మొక్కు తీర్చుకునేందుకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు తన తల్లి హ్యాండ్‌బ్యాగ్ చోరీ చేశారని, అందులో బంగారంతో పాటు నగదు ఉందని పేర్కొన్నారు. ఇక్కడి సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను చోరీ చేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య పెళ్లికొడుకు కోసం పోలీసుల వేట

అత్తాపూర్: ప్రేమ పేరుతో పెళ్లి చేసుకోవడం..కొద్ది రోజుల తరువాత మరో అమ్మాయితో ప్రేమ అంటూ వెంట పడుతున్న నిత్య పెళ్లి కొడుకు కోసం అత్తాపూర్ పోలీసులుగ గాలిస్తున్నారు. పెళ్లి పేరుతో మోసపోయిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవికుమార్ ఎలియాస్ రఫీపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. రవికుమార్ కొంత కాలంగా అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంగా చేస్తున్నట్లు నటించసాగాడు. తన కంటే వయస్సులో కంటే చిన్న వారిని గుర్తించి ప్రేమ పేరుతో నమ్మించి వివాహాలు చేసుకోవడం అలవాటుగా చేసుకున్నాడు. ప్రేమ పేరుతో అమ్మాయిలను లొంగదీసుకోవడంతో పాటు శారీరకంగా మానసికంగా హింసిస్తాడని పోలీసులు తెలిపారు. ప్రేమించుకునే సమయంలో మాట్లాడుతున్న సంభాషణలు వారు గడిపిన ప్రదేశాలను ఆడియో... వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానంటూ బెదిరిస్తూ ఉండటంతో బాధిత యువతులు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. తప్పించుకు తిరుగుతున్న రఫీపై వివిధ కేసులు నమోదు చేశారమన్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలు భద్రం

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- అప్రమత్తత తప్పనిసరి
- లేదంటే పశుసంపదకు ముప్పు
- పశువైద్యాధికారి విశ్వనాథం



నవాబుపేట: వానాకాలం సీజన్‌లో మనుషులకే కాదు.. మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. ఈ కాలంలో పశువులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. సూక్ష్మజీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు తదితర రోగాలు చుట్టుముడతాయి. ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు యాజమాన్య చర్యలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వాటి జీవన స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని, ఎలాంటి వ్యాధి సోకినా వెంటనే వైద్య చికిత్స అందించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ విశ్వనాథం రైతులకు సూచిస్తున్నారు. కాగా మండలంలో ఆవులు, ఎడ్లు 4,232 ఉండగా.. గేదెలు 1,162, గొర్రెలు 3,573, మేకలు 7,874 ఉన్నాయి.


పశువులకు గాలి కుంట టీకాలు వేస్తున్న వైద్యుడు (ఫైల్)

గాలికుంటు

గాలికుంటు వ్యాధి సోకిన పశువు చాలా బలహీనంగా ఉంటుంది. పాడి పశువులు నీరసించి పోతుంటాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. సాగు పనులకు ఎడ్లు సహకరించవు. సంకరజాతి పశువులతో పాటు షెడ్‌లలో పెంచుకునే వాటికి ఈ రోగం వ్యాపిస్తుంటుంది. ఎక్కువగా మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సోకే ప్రమాదం ఉంది. వ్యాధి బారిన పడిన పశువులకు నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారుతుంది. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడి మేత తీసుకోలేక నీరసించిపోతాయి. నోటి నుంచి సొంగ కారుతుంది.

జబ్బవాపు

వయసులో ఉన్న ఆరోగ్య వంతమైన పశువులు, తెల్లజాతి పశువులకు ఈ జబ్బవాపు వ్యాధి సంక్రమిస్తుంటుంది. ఇది సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతుంది. మేత మేయదు. నిత్యం పడుకొనే ఉంటుంది. జబ్బభాగం వాచి, నల్లగా కములుతుంది. అక్కడ కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి తీవ్రమైన నొప్పితో విలవిలలాడుతుంటుంది. వాపు ఉన్నచోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాంలో వైద్యం అందించకపోతే పశువు నీరసించి, చనిపోతుంది. సకాలంలో సూదిమందు, గ్లూకోజ్ ద్రావణాన్ని అందించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేయిస్తే మేలు.

గొర్రెల్లో కాలిపుండ్లు

వర్షాకాలంలో గొర్రెలు బురదలో తిరగడం వలన కాలిపుండ్ల వ్యాధి సోకుతుంది. గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లుతుంది. చీముపట్టి నొప్పితో ముందుకాళ్లపై గెంటుతాయి. వ్యాధి ముదిరితే గిట్ట లూడిపోతాయి. ఇది సోకిన జీవాలకు 10 శాతం మైలతుత్తం, పదిశాతం జింక్‌సల్ఫేట్, లేదంటే ఐదు శాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక ఆయిట్‌మెంట్ పూయాలి. యాంటిబయాటిక్ ఇంజెక్షన్ వరుసగా 3-5 రోజుల పాటు వేయించాలి. గొర్రెలను బురద నేలల్లో ఎక్కువగా తిరగనియొద్దు.

గురక వ్యాధి

ప్రస్తుత కాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు(గురక) ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న వాటికి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని బారిన పడిన వాటికి ఆకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. మేత మేయదు. గొంతుపై, మెడ కింద వాపు కన్పిస్తుంది. ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. వణుకుతూ ఉంటుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువ అయితే ఎడతెరిపి లేకుండా దగ్గుతూ, అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతుంది.

దోమలు దాడి చేస్తే..

నేల చిత్తడిగా ఉండి, వాతావరణం అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో నీరు నిల్వ ఉన్న గుంతలు, మురుగునీటి కాల్వల్లో ఈగలు, దోమలు ఆవాసాన్ని ఏర్పర్చుకుంటాయి. ఇవి ఆహారం కోసం పశువులపై దాడి చేస్తుంటాయి. ఈ సీజన్‌లో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. పశువుల శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. తద్వారా పశువులు మేత సరిగా మేయవు, నిద్ర పోవు. ఫలితంగా అవి రక్తహీనతకు గురవుతాయి. ఈగలు, దోమ కాటు వలన పశువు శరీరంపై పుండ్లు ఏర్పడతాయి. అందుకు పశువుల పాకలు, నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్‌ను పిచికారీ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండుపిడుకలు, వేపాకుతో పొగపెడితే ఈగలు, దోమలు తగ్గుతాయి.

లేత గడ్డి ప్రమాదం

తొలకరి జల్లులకు మొలిచే లేత గడ్డి మొక్కలను పశువులు అతిగా తింటుంటాయి. అయితే ఆ గడ్డిలో హైడ్రో సైనైడ్ విష పదార్థం ఉంటుంది. దీనిని మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. వెంటనే తగిన చికిత్స చేయించకపోతే అది మృత్యువాత పడే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు పశువులకు లేత గడ్డిని మేతగా వేయవద్దు. తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.